

# కేశవ - కేశ సంపద

-ఆదోని లలిత

**కేశవ కుటుంబం స్టేట్స్‌లో మూడు సంవత్సరాలు పనిచేసి తిరిగి వస్తున్న కేశవను రిసీవ్ చేసుకోటానికి కారులో ఎయిర్ పోర్టుకు బయలు దేరారు. కేశవ తండ్రి జనార్దనం కారు డ్రయివ్ చేస్తుంటే, తల్లి రాజ్యం ప్రక్కన కూర్చుంది. వెనుక సీట్లో కేశవ భార్య నీలిమ, కూతురు మధుర, చెల్లి రజని కూర్చున్నారు. అందరి మనస్సులలోనూ మూడు సంవత్సరాల తర్వాత కేశవను చూడబోతు న్నామన్న సంతోషం.**

కేశవ వెళ్లేటప్పుడు మధురకు రెండు సంవత్సరాలు. అందరు నాన్న వస్తున్నారని చెప్పితే ఆ అమ్మాయికి ఏదో కొత్తగానూ, సంతోషంగానూ అనిపించింది. ఈ మూడు సంవత్సరాలకు కేశవ పంపిన డబ్బుతో ఇల్లు, కారు, మరెన్నో వసతులు అమర్చుకున్నారు. దారిలో ఏదో వూరేగింపు అడ్డు రావటంతో వాళ్లు ఎయిర్ పోర్టుకు చాలా ఆలస్యంగా చేరారు.

అప్పటికే కేశవ తన బ్యాగేజ్‌తో లాంజ్‌లో తన వాళ్ల కోసం ఎదురు చూస్తున్నాడు. చాలా ఆలస్యమయినందుకు అందరూ లాంజ్‌లోకి ప్రవేశించి అక్కడ కూర్చున్న కేశవను పోల్చుకోకుండా అతన్ని దాటి ముందుకు నడిచి కేశవ కోసం ఆతురతతో చూడ సాగారు. తనను చూడకుండా తన ముందు నుంచే నడచి వెళ్లిన తన కుటుంబ సభ్యుల వేపు, కేశవ ఒక్క నిముషం ఆశ్చర్యంగా చూశాడు. తరువాత మెల్లగా వాళ్ల ముందుకెళ్లి 'హాయ్' అన్నాడు సంతోషంగా.

కేశవ స్వరాన్ని పోల్చుకుని అందరు వులికి పాటుగా అటు తిరిగి చూసి ఒక్క నిముషం విస్ఫారిత నేత్రాలతో అతన్ని చూస్తుండి పోయారు ఆశ్చర్యంగా. మరు నిముషం అంతా ఆశ్చర్యం నుండి తేరుకుని సంతోషంతో అతన్ని చుట్టుముట్టారు. కేశవ కూతురు మాత్రం తన పోనీటెయిల్ కంటే మూడు రెట్లు పొడవుగా వున్న కేశవ పోనీటెయిల్‌ను ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది. కేశవ కూతురును ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. తరువాత అందరు ఇంటికి బయలుదేరారు. వారి ఆశ్చర్యానికి కేశవను పోల్చుకోకుండా ముందుకు పోవటానికి కారణం కేశవ పోనీటెయిల్.

ఇంటికి చేరిన తర్వాత కేశవ ఇంటిని చూసి తృప్తి పడ్డాడు. తెచ్చిన వస్తువులను చూపించి ఎవ్వరికి తెచ్చిన వస్తువులను వారికి అందజేశాడు. అందరు చాలా సంతోషించారు. ఆ రోజంతా మాటలతో సందడిగా, సంతోషంగా గడిచిపోయింది. రాత్రి భోజనాల తరువాత అందరు తమ తమ గదుల కెళ్లారు.

నీలిమ గదిలోకి రాగానే కేశవ ఆమెను వూపిరాడకుండా ముద్దుల వర్షం కురిపించాడు. మరి మూడేళ్ల ఎడబాటంటే మాటలా? అలా ముద్దుల వర్షంతో కురిపించిన నీటిలో మునుగుతూ, తేలుతూ తృప్తిగా ఈదులాడి అలసటగా వడ్డుకు చేరి సేద తీర్చుకుంటున్నట్లు, కేశవ నీలిమ వడిలో పడుకుని-

''నీలూ! నా హెయిర్‌స్టయిల్ ఎలా వుందోయ్?'' అని అడిగాడు. నీలిమకు వెంటనే ఏం చెప్పాలో అర్థంగాక, ఇబ్బందిగా నవ్వి-

''టయర్డ్‌గా వున్నారు. ఈ రోజుకు పడుకోండి. తరువాత మాట్లాడుకోవచ్చు.'' అని అతని గుండెలో తలపెట్టుకుని పడుకుంది. కేశవకు వెంటనే నిద్ర పట్టింది. నీలిమకు మాత్రం ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు.

''కేశవ ఇలా మారిపోయాడేంటి! అసలు స్టేట్స్‌కెళ్లాక హెయిర్ కట్ చేయించుకొనలేదా కొంపదీసి. అందుకే ఇంత పొడుగ్గా పెరిగింది. ఏదో కాస్త పొడుగ్గా జుట్టు పెట్టుకోటంగాక, మరీ ఇంత పొడవుగా పెంచి, హైగా రబ్బరు బాండు వేసి పోనీ టెయిల్ కట్టుకోటమా? ఆడవాళ్లలాగ. ఛీ! ఛీ! ఏం బాగాలేదు''- ఇలా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు. కానీ, కేశవ అడిగినపుడు వెంటనే ''నచ్చలేదు'' అని చెప్పలేకపోయింది. చెప్పితే ఏమనుకుంటాడో అన్న సందేహం. కాస్త నెమ్మదిగా చెప్పితే బాగుంటుందనుకుంది. అలా ఆలోచిస్తూ చాలా సేపటి తరువాత నిద్ర పోయింది నీలిమ.

మధురకు రజనితో పడుకోటం అలవాటు. నిద్రపోయేంత లోపల ''నాన్నకు పోనీటెయిల్ ఎందుకుంది? నా పోనీటెయిల్ కంటే పెద్దదిగా వుందే''- అన్న ప్రశ్నలతో విసిగించింది.



కేశవ తల్లితండ్రుల గదిలోనూ ఇద్దరి మధ్య అదే చర్చ.

''ఏమండీ! బాబు కేశవ ఇలా పోనీటెయిల్‌తో వాచ్చాడేం టండీ! నాకయితే నచ్చలేదు. ఆడపిల్లలాగ ఆ పోనీటెయిల్ ఏంటీ? మరి మీకేమనిపిస్తుంది?.. అంది రాజ్యం.

''ఇందులో మనకు నచ్చటం, నచ్చకపోటమేంటి రాజ్యం! ఇప్పుడదాక ఫాషన్ ఫారిన్ కంట్రీస్‌లో. మనవారు కొందరు వారి ఫాషన్‌ను అనుకరిస్తున్నారు. నాకూ నచ్చలేదనుకో. కాని, వానితో ఎలా చెప్పటం. కొద్ది రోజులు పోనీ. చెప్పి చూద్దాం. ఇప్పుడే చెప్పితే బాగుండదు'' అన్న భర్త మాటలకు-

''ఆ ఏం ఫాషనండీ! ఆడవాళ్లలాగ, పోనీటెయిల్ వేసుకోవడం కూడా ఫాషనేనా? అక్కడేదో ఫారిన్‌లో ఫాషనయితే మనమూ అనుకరించటమేనా? పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు. మన సభ్యత, మన సంస్కారం గురించి ఆలోచించక్కర్లేదా-'' అని ఇంకా ఏదో రాజ్యం చెప్పబోతుంటే జనార్ధనం-

''ఇక పడుకో రాజ్యం! నాకు నిద్రొస్తుంది'' అని వత్తిగిలి పడుకున్నాడు.

మరుసటిరోజు, కేశవ ఆఫీసుకు వెళ్లగానే ప్రక్కింటి కమలమ్మ వచ్చింది. ''ఆమెను చూడగానే నీలిమ ''రండి పిన్నిగారూ!''



అంటూ ఆహ్వానించింది.

''అమ్మాయ్! నీలూ! కేశవ వస్తున్నట్టు చెప్పారు, నిన్న రావటం కూడా చూశానులే. ఏదో సంతోషంగా తిరిగొచ్చాడు. నాకూ చాలా సంతోషంగా వుంది'' అంది కమలమ్మ.

''అంతా మీ ఆశీర్వాదం పిన్నిగారూ! కాఫీ తీసుకుంటారా?'' అంటూ లేవబోతుంటే కమలమ్మ-

''ఆ! కాఫీకేం అవసరం. అమ్మాయ్! నీలూ! అంతా బాగానే వుంది కాని, ఆ జుట్టేంటి? మరీ అలా పెంచాడు. పెంచటం కాకుండా చక్కగా రబ్బరు బాండుతో పోనీటెయిల్ వేసుకున్నాడు. అచ్చం ఆడపిల్లలాగ'' అంది.



ఆమె అలా అడగటం నీలిమకు చాలా ఇబ్బందిగా అనిపించింది. ఏం చెప్పాలో తోచక-

''పిన్నిగారూ! ముందు కాఫీ తెస్తానుండండి'' అంటూ వంటింటి వైపు దారి తీసింది. అంతలో రాజ్యం తనగది నుండి బయటికొచ్చి కమలమ్మతో మాట కలిపింది. నీలిమ ఇద్దరికి కాఫీ ఇచ్చింది. కమలమ్మ కాస్సేపు మాట్లాడి బయలుదేరింది ఆమె వెళ్లాక-

''అత్తయ్యా! విన్నారా! కమలమ్మ పిన్ని ఎలా అడిగారో!''

''ఆ! అవునమ్మా నీలూ! నాకూ రాత్రి సరిగా నిద్రపట్ట లేదనుకో, అంత జుట్టుతో వాణ్ణా భాగవతార్ వేషంలో చూసి. మరి ... నీకు నచ్చిందా...'' అంటూ నసిగింది రాజ్యం.

''ఆ! నాకు నచ్చటమేంటి అత్తయ్యా! వారిని పోనీటెయిల్‌తో చూస్తుంటే నాకేంటో వొళ్లంతా తేళ్లూ, జర్రులు పాకినట్లుంది. ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. పోనీ, అత్తయ్యా మీరు చెప్ప కూడదూ?'' అన్న నీలిమ మాటకు రాజ్యం అదిరిపడి,

''అమ్మో! నేను చెప్పటమే! నామాట వాడు వింటాడా నీలిమా! వాడు సంతోషంగా వున్న సమయం చూసి నీవే చెప్పమ్మా!'' అంటూ తన గదికి వెళ్లిపోయింది. నీలిమ నిట్టూరుస్తూ వంటగది వేపు దారితీసింది.

సాయంకాలం కేశవ ఆఫీసు నుంచి వచ్చి, హాలులో అమ్మానాన్నలతో మాట్లాడుతున్నాడు. నీలిమ అందరికి కాఫీ అందించింది. కాఫీ తాగుతూ కేశవ,

''పాపెక్కడ!'' అనడిగితే

''పక్కింటి పిన్నిగారి దగ్గరికి కెళ్లిందండీ! వచ్చేస్తుంది'' అని నీలిమ అంటుండగానే మధుర చేతిలో సంపెంగ పువ్వులతో పరుగు పరుగున వచ్చి

''అమ్మా! ఆంటీ పువ్వులిచ్చారు. ఎంత బావున్నాయో చూడు'' అని చూపించి నీలిమ తీసుకోబోతే ''ఆ! నీకివ్వను'' అంటూ కేశవ దగ్గరికి పరుగు దీసి-

''నాన్నా! ఈ పువ్వులు పెద్దపెద్దగా వున్నాయి. నేనూ, అమ్మ పెట్టుకుంటే బాగోవు. మీకయితే పెద్ద పోనీ వుందిగా! మీరు పెట్టుకుంటే బలేగుంటుంది'' అని పువ్వు లివ్వబోతుంటే నీలిమ నవ్వాపుకోలేక ఫక్కున నవ్వింది. రాజ్యం కొంగుచాటున ముసిముసిగా నవ్వింది. జనార్దనం చేతిలో వున్న పేపరును చదివే నెపంతో ముఖానికి అడ్డు పెట్టుకుని నవ్వుకున్నాడు. కేశవ పాపకు బదులివ్వకుండా అందరివేపు కోపంగా చూస్తూ తనగదిలో కెళ్లిపోయాడు. పాప, నాన్న పువ్వులు తీసుకోకుండా ఎందుకలా కోపంగా వెళ్లిపోయారో అర్థం గాక, చిన్నబుచ్చుకుని అలా చూస్తుండిపోయింది. రాజ్యం పాపకు నచ్చ చెప్పటానికి దగ్గరకు తీసుకుంది.

రాత్రి కేశవ నీలిమ కోసం ఎదురు చూస్తూ పడుకున్నాడు. నీలిమ వచ్చి ప్రక్కన కూర్చుంది. కేశవ ఆమె వొళ్లో పడుకుని ''ఏంటోయ్! ఇంత ఆలస్యం?'' అంటే, నీలిమ బదులు పలకకుండా కేశవ కళ్లలోకి చూస్తూ, జుట్టు సవరించబోయి చేయి వెనుకకు తీసుకుంది మౌనంగా. కేశవది వత్తయిన చక్కటి వుంగరాల జుట్టు. పెళ్లి చూపులరోజు తనను మొదట ఆకర్షించింది అదే. ఎప్పుడూ కేశవ తన వొళ్ళో పడుకున్నా నీలిమ ఆ అందమైన క్రాపును ఆప్యాయంగా సవరిస్తూ ఆనంద పడేది. అది ఆమెకెంతో ఇష్టం. ఇప్పుడు ఆ అందమైన క్రాపుకు బదులుగా పోనీటెయిల్, ఆమె మౌనంగా అలా ఆలోచిస్తూ వుండిపోవటాన్ని చూసి కేశవ,

''నీలూ! ఏమయింది నీకు? ఎందుకలా వున్నావు?'' అంటూ ఆమె మెడను వంచి ఆమె ముఖాన్ని తన గుండెకు హత్తుకున్నాడు. నీలిమ మెల్లగా తప్పుకుని వత్తిగిలి పడుకుంది.

''ఏయ్ నీలూ! ఏంటలా పడుకున్నావు?'' అంటూ ఆమెను తన వేపుకు త్రిప్పుకుని ''ఏమయింది? అక్కర్లేదా?'' అని ఆమె చెవిలో గోముగా, గుసగుసమని అడిగాడు.

''మూడ్‌లేదు'' అని సమాధానమిచ్చి మరలా వత్తిగిలి పడుకుంది. అలా చెప్పటమే సరయిన అస్త్రం ఆ పోనీటెయిల్ నుండి విముక్తి పొందటానికి అని అనుకుంది. తమ ఏడు సంవత్సరాల వివాహ జీవితంలో నీలిమ అలా చెప్పటం ఇదే మొదటిసారి. కేశవ కొంచెం తడబడ్డాడు ఆమె సమాధానం విని. అయినా తమాయించుకుని నెమ్మదిగానే,

''ఏం? ఎందుకలా?'' అన్నాడు.

''మీ పోనీటెయిల్ చూస్తుంటే నాకు మూడ్ రావట్లేదు. మీరు నా కళ్లకు నా కేశవలా కాకుండా, ఆడపిల్లలా కనిపిస్తున్నారు. మీ అందమైన క్రాపును వేళ్లతో సవరించినప్పుడంతా నన్ను నేను మరిచిపోయేదాన్ని. కానీ, ఇప్పుడు అలా చేయలేకపోతున్నాను'' అని ఠక్కున జవాబిచ్చింది నీలిమ.

''నీ కళ్లకే అలా కనిపిస్తున్నానోయ్. ఆఫీసులో చాలామంది నేను ఈ హెయిర్‌స్టయిల్‌లో చాలా స్మార్ట్‌గా వున్నావన్నారు''

''అంటే అనుండొచ్చు. నా కళ్లకలా కనిపించటం లేదు. ఎంత ఫాషనయినా ఆడవాళ్లు ఆడవాళ్లలాగుండాలి, మగవాళ్లు మగవాళ్లలా వుండాలి'' అంది నీలిమ.

''అంటే నీ వుద్దేశం, నేను మునుపటిలా షార్ట్‌గా క్రాపు చేయించుకోవాలనా? యూ! యూ!'' అని మాట పెగలక దిండు జరుపుకుని అటు తిరిగి పడుకున్నాడు కోపంగా. ఆ రాత్రి భారంగా గడిచిపోయింది.

మరుసటి రోజు, కేశవ ఉదయం వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. రాజ్యం తోటలో పువ్వులు తీస్తుంది పూజకు. అంతలో హెయిర్ ఆయిల్ సేల్స్ అమ్మాయి, మార్కెట్ సర్వే కోసం తిన్నగా లోపలికొచ్చి రాజ్యాన్ని చూసి,

''మేడమ్! మీరు ఏ హెయిర్ ఆయిల్ వాడుతారు? మా ప్రొడక్టు కేశ సంపద'' అని దండకం మొదలెట్టింది.

''ఆ! మీ నూనె వాడాను తల్లీ! అందుకే అంతా వూడి ఈ నాలుగు పోచలు మిగిలాయి'' అని వ్యంగ్యంగా బదులు చెప్పి పువ్వులు తీయటం మొదలెట్టింది.

సేల్స్ వాళ్లకు ఇలాంటి నిరాదరణ మామూలే. అందుకే ఆ అమ్మాయి ఆమె వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా మరో అడుగు లోపలికేసి అక్కడే పేపరు చదువుతున్న కేశవను చూసి

''వావ్! మీ హెయిర్ బ్యూటీఫుల్‌గా వుంది సర్. మీరు తప్పకుండా, మా ప్రొడక్టు 'కేశ సంపద'నే వాడుతుండాలి. నిజమేనా సర్?'' అని చాలా స్మార్ట్‌గా అడిగింది.

కేశవ పేపరు ప్రక్కన పెట్టి ఆమెవైపు తీక్షణంగా చూడటం, అప్పుడే కాఫీ కప్పుతో బయటికి వచ్చిన నీలిమ ఆ అమ్మాయి మాటలు విని కిసుక్కున నవ్వటం ఒక్కసారే జరిగింది. నేను రాంగ్ ప్లేసుకు వచ్చాననుకుని ఆ సేల్స్ అమ్మాయి అక్కడి నుండి వుడాయించింది.

సాయంకాలం, మధుర స్కూలు నుంచి జ్వరంతో ఇంటికొచ్చింది. నీలిమ కంగారు పడుతూ కూతురు చేత మాత్ర మింగించింది. తెల్లవారేసరికి జ్వరం ఎక్కువయింది. అప్పుడు డాక్టరు దగ్గరి కెళ్లక తప్పలేదు. మందులు వేసినప్పటికీ నాలుగు రోజులయినా జ్వరం తగ్గలేదు. అందరు చాలా కంగారు పడ్డారు. రక్తపరీక్షలో ఏమీ తెలియలేదు. అది మామూలు జ్వరమే అన్నారు డాక్టరు. జ్వరం తగ్గినందుకు అందరు కలిసి వెంకటేశ్వరునికి ముడుపు కట్టి, బిడ్డకు జ్వరం తగ్గిన తరువాత అందరం వచ్చి దర్శనం చేసుకుంటామని ప్రార్థించారు. అంతటితో ఆగక, కేశవ మూడు కత్తెర్ల జుట్టు కూడా ఇస్తామని మ్రొక్కాడు.

మరుసటిరోజు జ్వరం కొంచెం తగ్గింది. మరి రెండు రోజులకు జ్వరం బాగా తగ్గిపోయింది. వారం రోజులలో మధుర కోలుకుంది.

తరువాత, కేశవ తల్లిదండ్రుల, నీలిమ అంతా తిరుపతికి వెళ్లాలని నిర్ణయించుకుని కేశవ సమ్మతిని అడిగారు, అందుకు కేశవ-

''రేపు నాకు వీలు పడదనుకుంటాను. పోనీ మీరంతా వెళ్లి రండి'' అన్నాడు. ఆ మాటలకు నీలిమ,

''అదేంటండీ! మూడు కత్తెర్లు జుట్టు ఇస్తామని మొక్కుకుని మీరు రాకపోతే ఎలా? మొక్కు ఏమవుతుంది?'' అంది కంగారుగా.

ఆమె మాటకు కేశవ అదిరిపడి,

''వాడ్డా యూ మీన్! మూడు కత్తెర్లు అంటే నీ వుద్దేశం, నా జుట్టు అనా? బాగుంది. నేను మనసులో అనుకున్నది నీ జుట్టు ఇస్తామని.''

''ఏంటీ! నా జుట్టు ఇస్తామని అనుకున్నారా? అయ్యో రామా! అసలు నాకున్నది పిసరంత జుట్టు. అంతా కలిపితే రెండు కత్తెర్లకు కూడా సరిపడదు. మరి మూడు కత్తెర్లు ఎలా ఇస్తానండీ! అత్తమ్మ జుట్టు ఏదో నామమాత్రం. ఆమె కూడా మూడు కత్తెర్లు ఇవ్వలేదు. మరి పాపదేమో షార్ట్ బాబ్డ్ హెయిర్. అందుకే మీరు మూడు కత్తెర్లు ఇస్తారనుకున్నాను. నేనే కాదు. అత్తమ్మ, మావయ్య కూడా అలానే అనుకున్నారు'' అంది నీలిమ.

ఆమె మాటలు విని కేశవకు పిచ్చిగా అరవాలనిపించింది కాని అరవలేకపోయాడు. తను అనాలోచితంగా ఆ విధంగా మొక్కుకున్నందుకు తనను తాను అతికష్టం మీద నిగ్రహించుకుని గట్టిగా తల బాదుకుని-

''అయితే నా పోనీటెయిల్'' అన్నాడు, నాన్నమ్మ వొళ్లో పడుకున్న మధుర వెంటనే ''గోవిందా! గోవిందా!'' అంది.

అందరూ ఫక్కున నవ్వారు.

కేశవ మాత్రం ఏడవలేక నవ్వాడు.

★

అంటోంది మాజీ ప్రపంచ సుందరి మెల్ల కన్ను సుస్మితాసేన్. నేనెప్పుడూ బిజీగా ఉంటాను - ఏదో ఒక పని మీద. నా ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్ అలాంటివి. కెరీర్ గూర్చి లేదా పర్సనల్ విషయాల గూర్చి కొత్త ప్రణాళికలు వేయడం - వీటితో నేనెప్పుడూ బిజీగా ఉంటా అంటోంది. ఈ ప్రణాళికలూ, పనులూ 'ఎవడో' గానీ ఇంకా బైటపడేట్టు లేడు. బైటపడే లోగా అత గాడూ 'మాజీ' ఐపోతాడేమో?



